క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లోని శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు మేయర్ నీలారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. కార్పొరేషన్ పరిధిలోని 13, 14 డివిజన్లలో ఉదయం 7 గంటలకు జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్పొరేటర్లు ఆవుల పావని, రాజేశ్వరిలతో కలిసి శంకుస్థాపనలు చేయనున్నారని పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం

జగద్గిరిగుట్ట: భూదేవిహిల్స్‌లో జాగృతి రూరల్ డెవలప్‌మెంట్, ఒహైయో స్టేట్ యూనివర్సిటీ, కొలంబస్ ద్వారా శుక్రవారం కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభిచారు. మగ్గం వర్క్స్, జ్యూట్ బ్యాగ్స్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ తదితర వాటిపై మహిళలకు శిక్షణ ఇస్తారు. స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంక్ రుణాలు ఎలా పొందాలో అవగాహన కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు.

21న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

నిజాంపేట్: నిజాంపేట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 21న స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీధర్మశాస్త దేవాలయ చారిటబుల్ ట్రస్ట్ ఓ ప్రకటనలో తెలియజేసింది. ఈ మహోత్సవంలో భాగంగా 19వ తేదీన అచార్యవరణం, శుద్ధిక్రియలు, జంబ పరిగ్రహం, జలాధివాసం, భగవతీ సేవ, 20న గణపతిహోమం, కుంబేశ కర్కారికలశ పూజ, నిద్రకలశ పూజ, శిరస్తత్వ హోమం, జంబ శుద్ధి కలశాభిషేకం, 21న ఉదయం 7.12 గంటల నుంచి 8.42 గంటల వరకు అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

రీసైక్లింగ్‌కు కసరత్తు

కుత్బుల్లాపూర్: ఇంట్లో ఉపయోగపడని వస్తువులను రీసైక్లింగ్ చేసేలా కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రేటర్ అధికారుల ఆదేశాలతో వైద్య ఆరోగ్య అధికారి రజినీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో కలిసి సమావేశమయ్యారు. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, సుభాష్ నగర్, రంగారెడ్డినగర్ నాలుగు డివిజన్ల పరిధిలో నాలుగు పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కాలనీలో నివాసం ఉండేవారు ఉపయోగపడని వస్తువులను తీసుకువచ్చి ఆ ప్రాంతంలో వేస్తే వాటిని రీసైక్లింగ్ సెంటర్‌కు తరలించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే కూకట్పల్లి జోనల్ పరిధిలోని అన్ని సర్కిల్‌లో వీటికి సంబంధించిన ప్రాంతాలను ఎంపిక చేసి శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించే దిశగా అడుగులు వేయాలని జోనల్ కమిషనర్ మమత ఆదేశించడంతో కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఈ ప్రక్రియ ప్రారంభించారు.

ఏబీవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా సోమేశ్‌యాదవ్


నియామక పత్రం అందుకుంటున్న సోమేశ్‌యాదవ్

కుత్బుల్లాపూర్: అఖిల భారత యాదవ మహాసభ (ఏబీవైఎం) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన దూదిమెట్ల సోమేశ్‌యాదవ్ నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావుయాదవ్, ప్రధాన కార్యదర్శి శేఖర్‌యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. సోమేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధిగా నిర్వహిస్తానన్నారు. యాదవులు ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా ఎదిగేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణయాదవ్, నర్సింహయాదవ్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ విభాగాల్లో చేరేందుకు టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అడ్మిషన్ ఫారంతో పాటు టెన్త్‌క్లాస్ పాస్ మెమో జిరాక్స్, టెన్త్ ఒరిజినల్ టీసీ, టెన్త్ బోనోఫైడ్ జిరాక్స్, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ, ఆదాయం పత్రాల జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోలను జత చేసి బహదూర్‌పల్లి క్రాస్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో అందజేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

781 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శం: ఎమ్మెల్యే వివేకానంద్


ఎంజేఎస్ ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పేదింటి ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకూడదనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి షాదీముబాకర్ పథకాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన 781 మంది లబ్ధిదారులకు రూ.7,81,90,596 విలువ చేసే కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పైరవీలు, దళారుల మోసాలకు తావు లేకుండా అర్హులైన వారికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, అధికారులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రగిరినగర్‌లో ప్రగతి యాత్రలో..

గాజులరామారం డివిజన్ పరిధి చంద్రగిరినగర్‌లో ప్రగతియాత్రలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికంగా భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని బస్తీవాసులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. డీజీఎం విష్ణు, ఏఈ కల్యాణ్, బీఆర్ఎస్ నాయకులు రషీద్ బైగ్, కస్తూరి బాలరాజ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా ఏర్పాట్ల పరిశీలన..

ఈనెల 22న కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగే మెగా జాబ్ మేళా ఏర్పాట్లను ఎమ్మెల్యే వివేకానంద్ ఎండీ వేణుగోపాల్, సీఐలు పవన్, వెంకటొరెడ్డిలతో కలిసి పరిశీలించారు. నిరుద్యోగ యువతకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన వీఆర్ఏలు..

రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం దుండిగల్ మండలానికి చెందిన వీఆర్ఏలు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అసెంబ్లీ వేదికగా వివేకానంద్ వీఆర్ఏల సమస్యలను లెవనెత్తి రాష్ట్ర ప్రభుత్వం తమను పర్మినెంట్ చేసేలా చర్యలు తీసుకున్నారని, ఎల్లప్పుడు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వీఆర్ఏలు విజయ్, నరేష్, మహేందర్, వినేశ్, రాజు, గాయత్రి, మీన, శ్రీనివాస్ ఉన్నారు.

ఆనందంలో వీఆర్ఏలు.. కేసీఆర్‌కు కృతజ్ఞతలు

దుండిగల్: వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు తీసుకున్న నిర్ణయంపై వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ నూతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. వీఆర్ఏల క్రమబద్ధీకరణ, వివిధ శాఖల్లో సర్దుబాటు, పే స్కేల్ వర్తింపు తదితర అంశాలపై స్పష్టమైన ప్రకటన రావడంతో వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేశారు. గండిమైసమ్మ దుండిగల్ మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో బాణసంచా పేల్చి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

- అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, గండిమైసమ్మ దుండిగల్ మండల తహసీల్దార్ పద్మప్రియలను మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు. తమ పట్ల సానుకూలంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎప్పుడు రుణపడి ఉంటామన్నారు. తమ మేలు కోసం నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించే బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు నరేష్, మహేందర్, విజయ్, రాజు, దినేష్, అంజయ్య, సత్తయ్య, యాదయ్య, సతీష్, మీనా, గాయత్రి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గండిమైసమ్మ - దుండిగల్ రెవెన్యూ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు


● కుటుంబ సమేతంగా శ్రీవారికి పూజలు

శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ఉన్నారు. – దుండిగల్

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన సర్కారు బడి విద్యార్థులు

కుత్బుల్లాపూర్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు కుత్బుల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు విద్యార్థులు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. 8వ తరగతి విద్యార్థులకు మాత్రమే నిర్వహించే పరీక్షకు మొత్తం 31,807 మంది విద్యార్థులు హాజరుకాగా తెలంగాణ నుంచి 2,716 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వారిలో కుత్బుల్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 8 మంది విద్యార్థులున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు నేహాదేవి, రేవంత్, సాయినాథ్, శరణ్య, స్పందన, శ్రీరామ్, శ్రీయ, అభికుమార్, హేమ గాయత్రి, మోహిత్, శివనందినికు ఇంటర్ పూర్తయ్యేంత వరకు ప్రతి ఏడాది రూ.12వేల ఉపకార వేతనం అందుతుందన్నారు. స్కాలర్‌షిప్ సాధించడంతో తమ ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

5న క్రికెట్ టోర్నమెంట్

శేరిలింగంపల్లి: పురం విశ్వకాంత్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శేరిలింగంపల్లి లేగల క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు నమో దు చేసుకోవాలన్నారు. ఫైనల్ మ్యాచ్ జూన్ 13వ తేదీ నిర్వహిస్తామన్నారు. విజేతకు రూ.50 వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.25 వేల నగదును అందజేస్తామని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు తొలగించి కల్వర్టులు నిర్మించాలి


దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

దుండిగల్: బహదూర్ పల్లి చౌరస్తా నుంచి కొంపల్లి వైపు వెళ్లే రోడ్డులో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి కల్వర్టులను నిర్మించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సత్యనారాయణ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. గతంలో బహదూర్ పల్లి చౌరస్తా నుంచి బహదూర్ పల్లి గ్రామం వరకు రెండు చోట్ల పాత కల్వర్టులు ఉండేవన్నారు. వాటిని పూడ్చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఎగువ ప్రాంతంలో ఉన్న సందయ్య కుంట, బొబ్బాకాన్ చెరువు అలుగులు పారినప్పుడు ఈ రోడ్డుపై నుంచే ప్రవహిస్తుందన్నారు.

- గతంలో ఉన్న పెద్ద కల్వర్టును అక్రమంగా పూడ్చివేసి అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నిర్మాణం చేపట్టారని లేఖలో పేర్కొన్నారు. వర్షాకాలంలో రోడ్డుపై నీరు ప్రవహిస్తే రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇదే విషయాన్ని హెచ్ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్తే అక్రమ కట్టడాలను తొలగిస్తే కల్వర్టులను నిర్మిస్తామని చెబుతున్నారని అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ అధికారులు వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి శ్యామ్‌రావు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తాను శుక్రవారం సర్కిల్, ట్రాఫిక్ అధికారులను సందర్శించి వాహనాలు రాకపోకలకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. గాజులరామారం సర్కిల్ డీఈ శిరీష, ట్రాఫిక్ అధికారి సుమిత్, సీఐ వెంకట్‌రెడ్డి ఐడీపీఎల్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునీకరణ, ఫ్రీ లెఫ్ట్‌ల ప్రాంతాల్లో ఆటోలు, ఇతర వాహనాలు నిలపకుండా వాహనాల రాకపోకలు సాగే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సర్కిల్‌లో ట్రాఫిక్ సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అటు జగద్గిరిగుట్ట రోడ్డు, ఇటు చింతల్– బాలానగర్‌లకు వెళ్లే నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పకడ్బంది ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.


ఐడీపీఎల్ చౌరస్తాను సందర్శిస్తున్న డీఈ శిరీష, పోలీసులు సుమిత్, వెంకట్‌రెడ్డి

దుండిగల్, నిజాంపేట్‌లలో శానిటేషన్ డ్రైవ్ షురూ


బహదూర్‌పల్లిలో పర్యటించిన దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ


మేడికుంట వద్ద స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించి సమస్యలను పరిశీలిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: స్వచ్ఛతకు కేరాఫ్ అడ్రస్‌గా నిజాంపేట్ కార్పొరేషన్‌ను తీర్చిదిద్దనున్నామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో 10 రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య పనుల్లో భాగంగా శుక్రవారం బాచుపల్లి మేడికంట చెరువు వద్ద స్పెషల్ డ్రైవ్‌ను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలిస్తే సమస్య తలెత్తదన్నారు. మే 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో రోడ్ల వెంబడి ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, విజయలక్ష్మి బీఆర్ఎస్ నాయకులు వెంగయ్య చౌదరీ, ప్రవీణ్ గౌడ్, రాము, బొబ్బా శ్రీనివాస్‌రావు, రజితరెడ్డి, శానిటేషన్ అధికారులు అజీజ్ ఖాసీం, వినోద్ కుమార్, సుకృత, సిబ్బంది పాల్గొన్నారు.

8రోజుల పాటు శానిటేషన్ డ్రైవ్..

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి 8రోజుల పాటు ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కొనసాగనుంది. మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లో ఈ డ్రైవ్ ను మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఓపెన్ నాలాలు, డ్రైనేజీని శుభ్రపరచడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, ఎప్పటికప్పుడు పబ్లిక్ టాయిలెట్లను శుభ్రపరచడం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రతి వార్డుకు ఒక్కో స్పెషల్ అధికారిని నియమించారు. దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ బహదూర్‌పల్లిలోని 14వ వార్డు లో పర్యటించారు. వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు సత్యనారాయణ, సుజాత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.అదేవిధంగా ఆయా వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బందితో కలిసి పనులను పర్యవేక్షించారు.

కైత్లాపూర్‌లో ట్రాఫిక్ మళ్లింపు

కూకట్‌పల్లి: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను శనివారం కైత్లాపూర్‌లో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 20వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 3గంట నుంచి రాత్రి 10గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

- ఈ సందర్భంగా మూసాపేట నుంచి కేపీహెచ్‌బీ 4వ ఫేజు, హైటెక్ సిటీకి వెళ్లే వాహనాలు మూసాపేట క్రాస్ రోడ్డు, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ మీదుగా దారి మళ్లించారు.
- అదే విధంగా ఐడీఎల్ లేక్ నుంచి మాదాపూర్, హఫీజ్ పేట్‌కు వెళ్లే వాహనాలను ఐడియల్ జంక్షన్, కూకట్‌పల్లి బస్‌స్టాప్, కేపీహెచ్‌బీ రోడ్డు నం.1 మీదుగా జేఎన్‌టీయూ జంక్షన్ వైపు నుంచి మళ్లించనున్నారు.
- హైటెక్ సిటి మీద నుంచి కూకట్‌పల్లి, మూసాపేట వచ్చే వారు కేపీహెచ్‌బీ 4వ ఫేజు లోదా అపార్టుమెంట్ నుంచి కేపీహెచ్‌బీ రోడ్డు నం.1కు మళ్లించారు.
- అదే విధంగా పర్వత్‌నగర్, మాదాపూర్ నుంచి మూసాపేట, కూకట్‌పల్లికు వచ్చే వాహనాలు ఎన్‌ఐఏ మీదుగా ఎడమవైపు తిప్పుకొని జేఎన్‌టీయూ క్రాస్ రోడ్డు మీదుగా వాహనాలను మళ్లించనున్నారు.
- పర్వత్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సుమారు 7గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.



మల్లారెడ్డి ఆస్పత్రిలో అరుదైన చికిత్స


బాలింత విమల, పసిబిడ్డలతో మల్లారెడ్డి ఆస్పత్రి వైద్యులు

సుభాష్‌నగర్: సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి వైద్యులు ప్రీఎక్లాప్సియాతో బాధపడుతున్న ఓ గర్భిణికి సంక్లిష్టమైన చికిత్స విధానంతో విజయవంతంగా ప్రసవం చేశారు. గాజులరామరానికి చెందిన గర్భిణి విమల ప్రీఎక్లాప్సియాతో బాధపడుతూ మల్లారెడ్డి ఆస్పత్రిలో చేరింది. ప్రసవానికి ముందు డాక్టర్ ప్రణతిరెడ్డి పర్యవేక్షణలో అత్యవసర ఎస్‌సీఎస్ఎస్‌ను నిర్వహించారు. అయితే పుట్టిన బిడ్డ 890 గ్రాముల బరువు ఉండటంతో నియోనాటాలజిస్ట్ డాక్టర్ దీపా పర్యవేక్షణలో పసిపాపను వెంటిలెటర్‌లో ఉంచారు. ప్రత్యేక లిక్విడ్‌లతో పాటు వైద్యం అందించడంతో ప్రస్తుతం శిశువుకు ప్రమాదం తప్పిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. మల్లారెడ్డి ఆస్పత్రిలోని ప్రత్యేక నియోనాటికల్ కేర్ ద్వారా బిడ్డ సంరక్షణ బాధ్యతలు చేపట్టామన్నారు.

ఎట్టకేలకు అందుబాటులోకి..

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో ఏళ్లుగా ఖాళీగా ఉన్న మోడల్ మార్కెట్ భవనం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ మోడల్ మార్కెట్‌లో రెండు షటర్లలో బస్తీ దావాఖానా ఏర్పాట్లు పూర్తవడంతో గురువారం ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. అంతే కాకుండా గ్రేటర్ హైదరాబాద్‌లో 150 డివిజన్‌లలో వార్డు కార్యాలయాల ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ ఆదేశించారు. జగద్గిరిగుట్ట డివిజన్‌కు ఖాళీగా ఉన్న ఈ మోడల్ మార్కెట్‌ను వార్డు కార్యాలయం చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 16న కంపౌండ్ వాల్ పనులు ప్రారంభం కాగా, కార్యాలయాలలో ఫర్నిచర్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలు పెట్టారు. మరో 15 రోజులలో వార్డు కార్యాలయ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని గాజులరామారం సర్కిల్ ఏఈ తిరుపతి తెలిపారు.


మోడల్ మార్కెట్ వద్ద కొనసాగుతున్న పనులు


బస్తీ దావాఖానాను ప్రారంభింభిస్తున్న ఎమ్మెల్యే

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం



రోడామేస్త్రీనగర్, బాచుపల్లిలలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

చింతల్: భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై జీవితాంతం పోరాడిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం రోడామేస్త్రీనగర్–బీలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యుడు రావుల వరప్రసాద్ మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరాలకు ఆదర్శమని అన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. దళితులు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఎంపీగా నిరాడంబరంగా పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లిన గొప్ప ఆదర్శమూర్తి అని అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, మల్లారెడ్డి, కరుణాకర్, బీరయ్య, గబ్బర్ సింగ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహోన్నతుడు

నిజాంపేట్: దేశంలోనే మొదటిసారిగా కార్మిక, కర్షక సంఘాన్ని స్థాపించి వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహోన్నతుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... మన దేశ మొదటి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడిగా దేశాభివృద్ధిలో కార్మిక కర్షక శ్రమజీవుల శ్రమ ఎంతో ఉందని చెప్పిన గ్రామిక పక్షపాతి సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణనాయక్, బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియా సీఐటీయూ నాయకులు మాణిక్యం, యాదగిరి, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను సాధిద్దాం

కూకట్‌పల్లి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ మండల కార్యదర్శి రాజశేఖర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఆయన జీవితాన్ని పేదలకే అంకితం చేశారన్నారు. బలహీనవర్గాల హక్కుల కోసం కొట్లాడిన మహానేతగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి అన్ని వర్గాల ప్రజలకు విముక్తి చేసిన మహానాయకుడు సుందరయ్య అని కొనియాడారు. దక్షిణ భారతదేశంలో సీపీఎం నడిపించిన గొప్ప నాయకుడు అన్నారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029